ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 18 అక్టోబరు 2024



ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగొండ పద్మ పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో పాటు మహిళపై హింస, వివక్ష దాడులను అరికట్టడంతో పాటు మహిళల ఆత్మగౌరవాన్ని భంగపరిచినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వాను సంప్రదించాలనుకునేవారు 9392218371 నెంబర్‌కు కాల్ చేసి తమ సమస్యలు చెప్పుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సరెండర్

● ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్


జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను సీడీఎంఏకు సరెండర్ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పట్టణంలో పలు సందర్భాల్లో కమిషనర్ వివాదస్పదంగా వ్యవహరించడం, ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించడం, ప్రజాప్రతినిధులు, అధి కారులు, ఉద్యోగుల పట్ల సమన్వయంతో లేకపోవడం తదితర ఫిర్యాదులు పలు పర్యాయాలు కలెక్టర్‌కు అందాయి. వివాదస్పదంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను సీడీఎంఏకు సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి నివేదికను పంపారు.

అనుమానిత దొంగలను పోలీసులకు అప్పగింత

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 : జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో వ్యవసాయ కరెంట్ మోటార్లను దొంగతనానికి పాల్పడుతున్న అనుమానిత దొంగలను పట్టుకొని రూరల్ పోలీసులకు అప్పగించినట్లు చల్‌గల్ గ్రామస్థులు తెలిపారు. దీని పై పోలీసులు విచారణ చేపట్టారు.

రైతులకు అవగాహన సదస్సు

కొడిమ్యాల, అక్టోబరు 17 : రైతులు వరి పొలాల్లో హార్వెస్టర్‌తో కోత కోయించినప్పుడు తప్పతాలు, దుమ్ము, దూళి లేని నాణ్యమై వరిధాన్యాన్ని పొందాలని ఏవో పి. జ్యోతి కోరారు. గురువారం మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలోని హార్వెస్టర్ యజమానులతో పొలంలో వరి కోస్తున్నప్పుడు తీసుకోవాలిసిన జాగ్రత్తలపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఫ్యాన్ స్పీడ్‌ను తగిన మోతాదులో సరిచేసుకోవా లన్నారు. హార్వెస్టర్ ఆర్‌పీఎంను 16 నుండి 18 మద్యలో ఉంచి నాణ్యమైన వరిధాన్యం పొందాలన్నారు. ఏవో వెంల ఏఈవోలు గ్రీష్మ, రాజేష్, పలువురు హార్వెస్టర్ యజమానులు ఉన్నారు.



కుల గణనకు కసరత్తు

- 60 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు
- ఎన్యూమరేటర్ల నియామకానికి ప్రయత్నాలు
- ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాల సేకరణ
- పూర్తి స్థాయి మార్గదర్శకాలు రాగానే ప్రక్రియ ప్రారంభం
- అన్నింటికీ ప్రామాణికం కానున్న కుల లెక్కలు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మారోసారి సామాజిక సమగ్ర సర్వేకు ప్రభుత్వం సిద్దమవుతోంది. ఇంటింటికీ పర్యటించి అన్ని కుటుంబాల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్ని అంచనా వేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక సర్వే నిర్వహించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికల జరిపిస్తామని ఇటీవల పలువురు ప్రభుత్వ పెద్దలు స్పష్టతనిచ్చారు. 2014 సంవత్సరంలో తొలి తెలం గాణ ప్రభుత్వం సమగ్ర సర్వేను చేసినప్పటికీ జిల్లాల వారీగా, కులాల వారీగా జనాభాను మాత్రం ప్రకటించలేదు. ప్రస్తుత సర్వేతో జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ వర్గాల రాజకీయ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ గణన ఉప యోగపడుతుందని అంచనా వేస్తున్నారు. సర్వే నివేదిక 60 రోజులల్లోపే పూర్తి చేయాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు బాధ్యతలు

జిల్లాలో కుల గణనను పూర్తి చేయడానికి ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. గణనకు ఎంత మంది ఎన్యూమరేట్లు అవసరమ వుతారు.. ఎన్ని టీంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఏఏ ప్రభుత్వశాఖల నుంచి ఎన్యూమ రేటర్లను సేకరిం చాలి అన్న అంశాలపై ప్రస్తుతం జిల్లా అధికారులు కసరత్తులు చేస్తు న్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న వివరాలను పరిగణలోకి తీసుకొని టీంలను, ఎన్యూమరేటర్లను నియామకం చేయడానికి కసరత్తులు చేస్తున్నారు. 1,500 జనాభాకు ఒక టీంను ఏర్పాటు చేసి, సంబంధిత టీంలో సుమారు 10మంది ఎన్యూమరేటర్లను నియమించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు నెలల్లో కుల గణన సర్వేను పకడ్బందీగా పూర్తిచేసి నివేదించడానికి సిద్దమవతున్నారు.

సంపూర్ణ ఆదేశాల కోసం నిరీక్షణ..

జిల్లాలో సామాజిక సమగ్ర సర్వేను నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ ఆదేశాలు రావాల్సి ఉంది. ప్రాథమికంగా గణను నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇందుకు అవసరమైన పూర్తి స్థాయి మార్గదర్శకాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎప్పుడు సంపూర్ణ మార్గదర్శకాలు అందితే అప్పుడు సర్వేను నిర్వహించడానికి అధికార యంత్రాంగం సమా యత్తం అవుతోంది. ఇదిలా ఉండగా 2011 జనాభా లెక్కల ప్రకారం జగిత్యాల జిల్లాలో 9,88,912 జనాభా ఉంది. ఇందులో స్త్రీలు 5,04,833, పురుషులు 4,84,079 మంది ఉన్నారు. ప్రస్తుతం 10,89,779గా పెరిగినట్లుగా ఓ అంచనా ఉంది.

లెక్కలు తేలితే...

బీసీల్లో వందకు పైగా కులాలు, ఉపకులాలు ఉన్నప్పటికీ ఉద్యోగ, రాజకీయ సాధాన్య రిజర్వేషన్లు మాత్రం తక్కువగా ఉంటున్నట్లు ఆయా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ, పీసీసీ నేత రేవంత్ రెడ్డిలు అధికారంలోకి రాగానే కులగణన చేపడుతామని హామీనిచ్చారు. జనాభాలో సగానికంటే ఎక్కువ ఉన్న తమకు అదే ప్రాతిపదికన తమకు ఫలాలు దక్కాలని గత కొన్నేళ్లుగా బీసీల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈవాదనను ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు నినాదంగా మార్చుకున్నాయి. రాజకీయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 35శాతం, విద్య, ఉద్యోగ అవకాశాల్లో 29శాతం రిజర్వేషన్లు దక్కుతుండడాన్ని ఆవర్గాలు వ్యతిరేకిస్తున్నాయి.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే...



జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలు రాలేదు. ఇందుకు అవసరమైన సంపూర్ణ మార్గదర్శకాలు వారం, పది రోజుల్లో వచ్చే అవకాశాలు ఉంది. ప్రస్తుతం సోషియో ఎకనామిక్స్ సర్వేకు అవసరమైన ప్రాథమిక కసరత్తులను చేస్తున్నాము. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఆదేశాలు వచ్చినా పకడ్బందీగా సర్వేను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాము.

- సత్య ప్రసాద్, కలెక్టర్, జగిత్యాల

రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్టోరు 17, 2019, ఫిబ్రవరి 25వ తేదీన రైతు సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరసన కార్యక్రమంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 15 మంది రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు, మక్కలు కొనుగోలు కేంద్రాలు, చెరుకు ఫ్యాక్టరీ కోసం 5 వేల మంది రైతులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడితే అక్రమంగా కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు కేసుల వలన రైతులు పంటలను, పశువులను వదిలిపెట్టి కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కేసులు వెంటనే రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు అయిల్నేని సాగర్ రావు, నేరెళ్ల భూమారెడ్డి, గోలి జనార్ధన్ రెడ్డి, ఏలేటి రాంరెడ్డి, గంగారెడ్డి, మందల గోపాల్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నవంబరు 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా గురువారం పొలాస పశు వైద్య ఉప కేంద్రంలో వ్యాధినివారణ టీకాలు వేశారు. ఇందులో 29 తెల్లజాతి పశువులు, రెనాల్ట్ 275 గేదెలకు టీకాలు వేసినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ భోనగిరి నరేష్ తెలిపారు. ప్రాణాంతకమైన ఈ వ్యాధి అతి సూక్ష్మ జీవుల వలన పశువులకు సోకి మీద స్థితిలో చనిపోయే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ పశువులకు టీకాలు ఇప్పించాలని కోరారు. పశు సంవర్ధక శాఖ అధికారులు పూర్ణచందర్, డాక్టర్ హిమజ పాల్గొన్నారు.

అంజన్న భక్తుల కొండగట్టు గిరిప్రదక్షణ



ప్రదక్షణ చేస్తున్న భక్తులు

మల్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చిలుకూరి బాలాజీ స్వామి శివాలయ ప్రధానర్చకులు సురేష్ ఆత్మరామ్ స్వామిజీ ఆధ్వర్యంలో అంజన్న భక్తులు కొండగట్టు గిరి ప్రదిక్షణను చేశారు. ప్రతి పౌర్ణమి రోజున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని 20వ సారి గురువారం దిగువ కొండగట్టు నుంచి ప్రారంభించి దొంగలమర్రి, జేఎన్‌టీయూ, ముద్దుట్ల, నూకపల్లి మీదుగా కొండపైకి నిర్వహించారు. ఈ ప్రదిక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులతో పాటు గతంలోని మాదిరిగానే ఓ శునకం భక్తులతో కలిసి ప్రదిక్షనలో పాల్గొంది. అనంతరం అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనంద్‌రావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంల ఉపాధ్యాయుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ టీఎస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. పద్మ, జమున, చందన, రజిత ఉన్నారు.

పోలీస్ సర్కిల్ స్థాయి వాలీబాల్ పోటీలు

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :అక్టోబరు 21 పోలీస్ అమనవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని మల్యాలలో పోలీస్ సర్కిల్ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఇందు లో మల్యాల సర్కిల్ పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాల నుంచి వచ్చిన వాలీబాల్ జట్లు పాల్గొనగా పెగడపల్లి జట్టు విన్నర్‌గా, కొడిమ్యాల మండలం నమిలికొండ జట్టు రన్నర్‌గా నిలిచింది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విజేత జట్టుకు కప్పు అందించారు. ఇక్కడ విజేతగా నిలిచిన జట్టు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనన్నుట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నీలం రవి, ఎస్సైలు నరేశ్‌కుమార్, సందీప్, రవికిరన్, పోలీసులతో పాటు ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, కంచర్ల లక్ష్మణాచారీ, గాజుల అజయ్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్

8



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

హత్య కేసులో నిందితుల అరెస్టు

● 4 సెల్‌ఫోన్లు.. 2 ద్విచక్ర వాహనాలు, కత్తి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

8

గడువులోపు సీఎంఆర్ అప్పగించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

8



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన రామాయణాన్ని ప్రపంచానికి వరంగా అందించడంతో పాటు సామరస్యం, ప్రేమ, త్యాగం, అభివృద్ధి ఆధారిత పాలనను ప్రపంచ వ్యాప్తంగా చాటుతూ అందరి అభిమానాన్ని మహర్షి వాల్మీకి చూరగొన్నారని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవతా విలువలను, ఉన్నతమైన అంశాలను రామాయణం అడుగడుగునా మనకు బోధిస్తుందని, అటువంటి గొప్ప కావ్యాన్న రచించిన మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గొప్పగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డి, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ హన్మంత రావు, ఆర్డీ వో మధుసూదన్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సాయిబాబా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జగిత్యాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాస్థాయి కళోత్సవాల్లో జగిత్యాల పట్టణం లోని శ్రీ చైతన్య, కేజీఆర్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీ చైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చెట్‌పెల్లి తరుణి ఇన్‌స్ట్రుమెంట్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాలల కరస్పాండెంట్ గంగా రెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ గంగాధర్, సనత్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, మ్యూజిక్ టీచర్ ప్రశాంత్ తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవాలకు ఎంపిక

కొడిమ్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని డి. సంజన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవాలకు స్టోరీ టెల్లింగ్ విభాగంలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి. లావణ్య గురువారం తెలిపారు. అంతే కాకుండ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అశ్విని ఏకపాత్రాభినయం విభాగంలో జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళా ఉత్సవాల్లో పాల్గొని ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫీడర్ చానల్ నిర్మాణం లేక రైతుల కష్టాలు

సాగుకు నోచుకోని 250 ఎకరాల భూములు



తీగలధర్మారంలోని మల్లచెరువు



గాదెపల్లి సమీపంలో గల 4ఎల్-53 కెనాల్‌లో పెరిగిన గడ్డి

ధర్మపురి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తీగలధర్మారం గ్రామంలో ఫీడర్ చానల్ నిర్మాణం లేక పోవడం వల్ల రైతులు కష్టాలు పడుతున్నారు. దీంతో సుమారు 250 ఎకరాల వ్యవసాయ భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తీగలధర్మారం సమీపంలో గల గాదెపల్లి పక్కనే 4ఎల్ -53 కెనాల్ ఉంది. ఇక్కడి వరకు కెనాల్ ద్వారా పంట పొలాలకు సక్రమంగా నీరందుతుంది. ఇక్కడి నుంచి ఫీడర్ చానల్ నిర్మాణం కోసం మల్లచె రువు వరకు సుమారు 1.5 కిలో మీటర్ ఉంది. ఇక్కడి నుంచి ఫీడర్ ఛానెల్ నిర్మాణం జరిగితే మల్ల చెరువులోకి నీరు అందుతుంది. మల్లచెరువు నుంచి తీగలధర్మారం రాళ్లచెరువులోకి నీరు చేరి అక్కడి నుంచి దొంతాపూర్ తీగలచెరువులోకి నీరు చేరుతుంది. దీని ద్వారా సుమారు 250 ఎకరాల వరకు పంట పొలాలకు సక్రమంగా నీరు అందే అవకాశాలు ఉన్నాయి. తీగలధర్మారం గ్రామానికి చెందిన రైతులకు మల్లచెరువు, రాళ్లచెరువు ద్వారా సుమారు 200 ఎకరాలకు నీరు అందుతుంది. దొంతాపూర్ రైతులకు తీగల చెరువు ద్వారా 50 ఎకరాల వరకు పంట పొలాలకు నీరు చేరి సాగుకు నోచుకుంటాయి. కిలో మీటర్ న్నర వరకు ఉన్న ఈ ఫీడర్ చానల్ నిర్మాణం కోసం సుమారు 15 నుంచి 20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. ప్రభుత్వం స్పందించి వెంటనే గాదెపల్లి పక్కనే గల 4ఎల్-53 కెనాల్ నుంచి ఫీడర్ చానల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి రైతులకు ఆదుకోవాలని మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్ కోరుతున్నారు.

జగిత్యాల మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి కమిష నర్‌గా చిరంజీవి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమి షనర్ సమ్మయ్యను సీడీఎంఏకు సరెండర్ చేస్తూ కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. రాయికల్‌లో ఎంపీడీవోగా పనిచేస్తున్న చిరంజీవికి జగిత్యాల మున్సి పల్ (ఎఫ్‌ఏసీ) కమిషనర్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఈమేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చిరంజీవి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. చిరంజీవిని పలువురు మున్సిపల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ చిరంజీవి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గొల్లపల్లి, అక్టోబరు 17 : మండలంలోని గుంజపడుగు గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులను పంపిణీ చేసినట్లు మాజీ ఉప సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి హరికిరణ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అండగా నిలుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కస్తూరి హరికిరణ్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SAMBA ANJAIAH S/O. SAMBA RAJA GANGARAM, R/O. H.NO: 6-43/15/A, MAHITHAPUR, JAGITYAL, I, HAVE CHANGED MY NAME AS "SAMBA THUKKAIAH S/O."SAMBA RAJA GANGARAM.

AJK-16034

CHANGE OF NAME

★ I, SAMBA NARSU W/O. SAMBA RAJA GANGARAM, R/O. H.NO: 6-12, MAHITHAPUR, JAGITYAL. I, HAVE CHANGED MY NAME AS "SAMBA NARSAMMA W/O."SAMBA RAJA GANGARAM.

AJK-16034

CHANGE OF NAME

★ I, THOUHIDA BEGUM W/O. KHAJA AMEERUDDIN, R/O. H.NO: 3-6-148, ADARSHANAGAR, KARIMNAGAR. I, HAVE CHANGED MY NAME AS "THOUHIDA SULTHANA W/O. "KHAJA AMEERUDDIN.

AJK-16034

CHANGE OF NAME

★ I, SHABANA W/O. MD. MUSTHAQ. H.NO.7-14-265/7, JAM BAGH STREET, JAGTIAL TOWN & DISTRICT. PIN CODE: 505-327. SHALL HENCEFORTH BE KNOWN AS SHABANA W/O. MOHAMMED MUSTHAQ, D/O.MOHAMMED YUSUF ALI

AJK-201862

పాస్‌పోర్ట్ పోయినది

★ నేను పరాల రాజు తండ్రి : కిషన్, నివాసం : గోరూర్ గ్రా : ఇబ్రహీంపట్నం, మం: జగిత్యాల, జిల్లా నా యొక్క పాస్‌పోర్ట్ నెం.R4191261 గల పాస్‌పోర్ట్ ప్రైవేట్ వెళ్లే సమయంలో పోయినది. ఎవరికైన దొరికితే ఈ నెంబర్‌కు తెలుపగలరు. సెల్ : 9951833459

AJK-16037

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640

జగిత్యాల :- సెల్ : 9985411262

మెట్‌పల్లి :- సెల్ : 7013142966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063

పెద్దపల్లి :- 9550900238

క్రైం కార్నర్

పిడుగుపాటుకు రైతు మృతి


నర్సింహారెడ్డి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని రైతు కామిడి నర్సింహారెడ్డి (50) అనే రైతు పిడుగుపాటుకు గురువారం మృతి చెందాడు. బండలింగంపల్లికి చెందిన నర్సింహారెడ్డి పొలం వద్ద పాడి గేదెలను పెంచుతున్నాడు. గురువారం వేకువజామున పొలం వద్దకు వెళ్లి పాడి గేదెల పాలు పితికాడు. కాళ్లు, చేతులు కడుకుంటున్న క్రమంలో ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నర్సింహారెడ్డికి భార్య చంద్రకళ, కొడుకు అజయ్ ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సప్తగిరికాలనీలో నివాసముండే సొన్నాయిల రమేష్(60) అనే వ్యక్తి బుధవారం రాత్రి మున్సిపల్ జంక్షన్ సమీపంలోని జిమ్ వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. సన్నటి వైరుతో ఉరి వేసుకోవడంతో అది తెగి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్లేవారు చూసి 108కు ఫోన్‌చేయగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. రమేష్ బస్టాండ్ వద్ద సెలూన్ నడుపుకుంటూ జీవించేవాడు. కొంత కాలంగా రమేష్ మద్యానికి బానిసై మద్యం మత్తులో ఈనెల 16న ఉదయం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లాడు. రాత్రివరకు వెతికినా ఆచూకీ కనబడలేదు. గురువారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం పక్కన మానేరు కరకట్ట వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మెడలో పసుపు రంగు దారం, కుడిచెయికి రాగి కడెం ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన వేముల రాజశేఖర్(27) అనే యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజశేఖర్ చిన్నబోనాల బైపాస్ రహదారిపై ఈనెల 13న అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రహదారిపై ఆరబెటిన వడ్లపై జారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌కు నాలుగు రోజులుగా కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు, పరిస్థితి విషమించి గురువారం చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించిన కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆకుబత్తిని శ్రీకాంత్ (38)ను గురువారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ప్రస్తుతం సిరిసిల్లలో ఉంటున్న శ్రీకాంత్ గురువారం ఏటీఎం గదిలో సీసీ కెమెరాలను సీలింగును సుత్తితో పగులగొట్టి దొంగతనానికి యత్నించాడని తెలిపారు. ఐదు గంటల వ్యవధిలోనే సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

దొంగిలించిన ట్రాక్టర్ పట్టివేత

- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ


జూలపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ గజ్జి కృష్ణ

జూలపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేట గ్రామానికి చెందిన ఏముండ్ల అనిల్ అనే రైతు ట్రాక్టర్‌ను ఐదు నెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు గురువారం ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామశివారులో పట్టుకున్నారు. జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలను వెల్లడించారు. చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన జాతరగొండ అశోక్, జాతరగొండ శేఖర్ అనే వ్యక్తులు ట్రాక్టర్‌ను దొంగిలించి కొంతకాలం పాటు బయటకు తీయకుండా దాచి ఉంచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈక్రమంలో ఇంతకాలం దుండగులు దొంగిలించిన ట్రాక్టర్‌ను తమ పొలం వద్దనే దాచిపెట్టి గురువారం ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామం నుంచి గర్రెపల్లికి తరలిస్తుండగా అదే సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న జూలపల్లి పోలీసులు ట్రాక్టర్‌ను గుర్తించారు. దుండగులు ట్రాక్టర్‌ను వదిలి పారిపోతుండగా వారిని పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీసా పేరిట మోసం చేసిన వ్యక్తి అరెస్టు

బోయినపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌లో ఉపాధి అవకాశం కల్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ రూరల్ సీఐ ఎం శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన ముదాం వెంకటేష్ అనే వ్యక్తిని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం చెందిన దండుగుల కళ్యాణ్ వర్క్ వీసాపై గల్ఫ్ దేశానికి పంపిస్తానని రూ.75 వేలుతీసుకున్నాడు. అయితే వెంకటేష్‌ను పంపని వీసాపై కాకుండా టూరిస్ట్ వీసాపై గల్ఫ్‌కు పంపించాడు. వెంకటేష్ ఇంటికి తిరిగి వచ్చి మోసం చేసిన కళ్యాణ్‌పై ఎస్సై పృథ్వీధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దండుగుల కళ్యాణ్‌ని బుధవారం అరెస్టుకు పంపినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరికి ఏడాది జైలు

సుల్తానాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్రలతో దాడి చేసి గాయపరిచిన ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్షతో పాటు ఐదు వందల రూపాయల జరిమానా విధిస్తూ సుల్తానాబాద్ జూనియర్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ గురువారం తీర్పు చెప్పారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రీనగర్‌కు చెందిన కాంపల్లి శ్రీహిత కరీంనగర్‌లో నివాసం ఉంటూ దీపావళి పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఇంటి పక్కనున్న కల్వల లక్ష్మయ్య, కల్వల వినీష్ అనే వ్యక్తులు 7 నవంబర్ 2018న రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో టపాసులు శ్రీ హిత ఇంటిలో వేయగా కుటుంబ సభ్యులు ఇదేంటని అడిగారు. దీంతో ఆగ్రహించిన నిందితులు కర్రలతో శ్రీహిత కుటుంబ సభ్యులపై దాడి చేయగా తలలకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు కానిస్టేబుల్ దేవరాజ్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌ప్రసాద్‌రావు, ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌లు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో జడ్జి నిందితులకు ఏడాది జైలుశిక్షతో పాటు ఐదు వందల జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. గురువారం ఉదయం జమ్మికుంట మండలంలోని విలాసాగర్ నుంచి టేకుర్తి మీరుగా సన్ని, అశోక్, రాజ్‌కుమార్, రమేశ్, అంజి, రమేశ్ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

ఆదర్శం

తాము మరణించినా..

మరొకరికి జీవం పోస్తూ..

అవయవ దానానికి ముందుకు వస్తున్న కుటుంబాలు

- ఉమ్మడి జిల్లాలో అవయవదానంపై పెరిగిన అవగాహన
- ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు
- అవయవ దానానికి 60వేల మంది అంగీకారం...

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : "అమ్మ జన్మనిస్తే అవయవదానం పునర్జన్మనిస్తుంది.. మరణించినా కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి.. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి... శ్వాస ఆగిపోయినా గుండె మాత్రం కొట్టుకుంటూనే ఉంటుంది.. ఆయువు పోయినా.. అవయదానంతో ఊపిరిపోద్దాం.. అవయవాలను ఈ లోకంలో జీవించనిద్దాం... రండి అవయదానం చేద్దాం... మరణించినా మరమరొకరి దేహంలో జీవించే ఉందాం.." అంటూ గోదావరిఖనిలో 17ఏళ్ల క్రితం పురుడుపోసుకున్న 'సదాశయ ఫౌండేషన్' సంస్థ ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తోంది... వేలాది మంది అవయవదాన బాట పట్టిస్తున్నది.. కుటుంబ సభ్యులు అవయవాలే కాకుండా దేహదానాలకు కూడా ముందుకు వస్తున్నారు...



మృతదేహం వద్ద సెల్యూట్ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

● ఉమ్మడి జిల్లాలో 'సదాయశ' కార్యక్రమాలు...

సదాశయ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు అవయవదానంపై చేస్తున్న కృషికి.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజలు అవయవదానంపై స్పందిస్తున్నారు. ఇందులో మహిళలు, యువతనే ఎక్కువగా ఉంటుంది. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా మృత్యువుకు చేరువలో ఉన్న వ్యక్తి అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వస్తున్నారు. పార్థివదేహం కాలిబూడిదై మట్టిలో కలిసిపోకుండా ఉండేందుకు, వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఉపయోపడేలా మృతదేహాన్ని కూడా అప్పగించి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేత్రదానం చేసి అంధులకు వెలుగులు ప్రసాదిస్తున్నారు.

సదాశయ ఫౌండేషన్ ద్వారా..

నేత్రదానం చేసిన వారు	1196
అవయవదానం చేసిన వారు	88
మెడికల్ కాలేజీలకు దేహదానం చేసిన వారు	125
అవయవదానంపై అవగాహన సదస్సులు	1315
అవయవదానం చేస్తామని అంగీకారం తెలిపిన వారు	60 వేలు


దేహదానానికి కలెక్టర్‌కు అంగీకార పత్రం అందజేస్తున్న జర్నలిస్టు వాసు(ఫైల్)


తమ్ముడి కళ్లను ఐ బ్యాంకుకు దానం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్(ఫైల్)

● అవయవాలను ఇలా సేకరిస్తారు..

కుటుంబ సభ్యుల అంగీకారంతో బ్రెయిన్డెడ్ అయిన పేషెంట్ నుంచి అవయవాలను తీసిన తర్వాత, వాటి నాణ్యతను బట్టి నిబంధనల ప్రకారం ఆయా ఆసుపత్రులకు జాగ్రత్తగా తరలిస్తారు. కొన్ని సందర్భాల్లో గ్రీన్ ఛానల్ కూడా ఏర్పాటు చేసి గుండెను రోడ్డు మార్గంలో తరలిస్తారు.

● అవయవాల కోసం...

అవయవాలు కావాల్సిన వారు ముందుగా జీవన్‌దాన్ కేంద్రంలో పేరు, పేషెంట్ బ్లడ్ గ్రూప్, ఏ అవయవమో నమోదు చేయించుకోవాలి. ఆరోగ్యశ్రీ కార్డు అర్హులకు ఉచితంగా, మిగితా వారికి కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మరణానంతరం అవయవదానం చేయాలని కోరుకునేవారు, జీవన్‌దాన్ సంస్థతో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అవయవదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంస్థల దగ్గర పేర్లను నమోదు చేయించుకోవచ్చు.

బతికున్న వారు దానం చేసే అవయవాలు..

- ఒక కిడ్నీ
- 1/4 వంతు కాలేయం
- ఎముక మజ్జ కణజాలం

మనిషి మరణానంతరం దానం చేసేవి...

శరీరంలోని 200 అవయవాలు, కణజాలం దానం చేయవచ్చు. ముఖ్యమైన కండ్లు, గుండె, గుండె కవాటాలు, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్ద పేగు, చిన్న పేగు, రక్తనాళాలు, చెవిలోని కర్ణభేరి, ఎముకలు, మూలుగను తదితర వాటిని మృతుల నుంచి తీసుకుంటారు. ఇలా ఒక వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ఏడు నుంచి తొమ్మిది మందికి పునర్జన్మను ప్రసాదించే అవకాశం ఉందని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న సంస్థలు

- సదాశయ ఫౌండేషన్
- లయన్స్ క్లబ్
- తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం.

అవయవ దాతలు, అవగాహన కల్పిస్తున్న సంస్థలను ప్రభుత్వం గౌరవించాలి..

- టీ శ్రవణ్ కుమార్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు



నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పిస్తున్న సంస్థలు, అవయవ దాతలను ప్రభుత్వం, జీవం దాన్ సంస్థ గౌరవించాలి. మరణాంతరం నేత్రాలు, అవయవాలు వృథా పోనీయకుండా ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, శ్రీలంక తరహాలో మన దగ్గర ప్రభుత్వ లాంఛనాలతో అవయవదాతకు అంత్యక్రియలు నిర్వహించడం, కుటుంబానికి ప్రశంసాపత్రం, రూ.10వేలు ఆర్థికసాయం ఇచ్చేలా ఏపీ రాష్ట్రం స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకుంది. అవయవదానంలో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లాలపల్లెకు చెందిన గుర్రం మల్లారెడ్డి(41) అనే వ్యక్తి దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మల్లారెడ్డి కరీంనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకొని రాత్రి కరీంనగర్ నుంచి లాలపల్లెకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును గర్రెపల్లి వద్ద స్థానిక యువకులు పట్టుకున్నారు.

ఆస్తి కోసం భార్య, అల్లుడి ఘాతుకం

- హత్య చేసి.. సహజ మరణంగా చిత్రీకరణ
- నిందితుల అరెస్టు

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఐబీ కాలనీలో సెప్టెంబర్ 16న మృతి చెందిన సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్(60) సహజ మరణం కాదని, హత్యగా పోలీసులు తేల్చారు. ఆస్తి కోసం కట్టుకున్న భార్య దస్లి, చిన్న కూతురు సునీత భర్త రొంటాల నరేష్‌లు ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు తేల్చారు. మొదట అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నివేదికలో మెడ ఎముకలు విరగడం, ఛాతిపై, కాలుపై గాయాలతో మృతిచెందినట్టు నివేదికలో పేర్కొన్నారు. దీంతో అప్పటికే మృతుని కుమారుడు వెంకటేష్ ఫిర్యాదుతో భార్య దస్లి, నరేష్‌ల పాత్రపై విచారణ జరుపుతున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం ఒప్పుకున్నారు. హరిసింగ్‌కు భార్య, ఒక కుమారుడు వెంకటేష్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. చిన్న కూతురు సునీత గోదావరిఖనికి చెందిన నరేష్‌ను ప్రేమ వివాహం చేసుకున్నది. దీంతో తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకున్నదని హరిసింగ్ కూతురు, అల్లుడిని ఇంటికి రానివ్వలేదు. సింగరేణి కార్మికుడైన అల్లుడు నరేష్ మద్యానికి బానిసై డ్యూటీలు చేసేవాడు కాదు. హరిసింగ్ సెప్టెంబర్‌లో రిటైర్డ్ అవుతుండడంతో పదవీ విరమణ తరువాత డబ్బులు వస్తాయని, అవి తమకు ఇవ్వకుండా కొడుకు, పెద్ద కూతురుకే ఇస్తారని భావించారు. సునీత తన తల్లి దస్లితో ఇదే విషయమై మూడు నెలలుగా చెబుతోంది.. కూతురుకు డబ్బులు ఇవ్వాలని దస్లి తన భర్త హరిసింగ్‌కు చెప్పగా ఆయన తిరస్కరించారు. దస్లి పేర ఖమ్మంలో రూ.70లక్షల విలువైన ఇంటి స్థలం ఉంది. ఇది కాకుండా హరిసింగ్, దస్లి జాయింట్ అకౌంట్‌లో రూ.4లక్షల నగదు ఉన్నాయి. హరిసింగ్‌ను కడతేర్చితే డబ్బులు వస్తాయని, ఇంటి స్థలం కూడా అమ్ముకోవచ్చునని భావించారు. సెప్టెంబర్ 16న గణపతి నిమజ్జనం కావడం, ఆరోగ్యం బాగా లేక హరిసింగ్ ఇంట్లో పడుకోవడంతో దస్లి తన కూతురు సునీతకు ఫోన్ చేసి నరేష్‌ను పంపమని పేర్కొన్నది. పథకం ప్రకారం ఇంటికి వచ్చిన నరేష్ నిద్రలో ఉన్న హరిసింగ్ మెడకు వైరు బిగించాడు. భార్య దస్లి దిండుతో హరిసింగ్ ముఖంపై శ్వాస ఆడకుండా అదిమింది. దీంతో అతడు మృతి చెందాడు. కొద్ది సేపటికి బయటకు వచ్చి తన భర్త కదలడం లేదని, అనారోగ్యం బారిన పడ్డాడంటూ స్థానికులను నమ్మించింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు.

ఈ ఘటనపై హరిసింగ్ కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దానిని హత్య కేసుగా మార్చినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. నిందితులు బానోతు దస్లి, రొంటాల నరేష్‌లను గురువారం అరెస్టు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

రాయపట్నం వద్ద ఆటో బోల్తా

- బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ధర్మపురి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం రహదారి వద్ద ఒక ఆటో బోల్తాపడి బైక్ ఢీకొట్టడంతో గురువారం మేడిశెట్టి వెంకటయ్య, మైదం అశోక్ అనే ఇద్దరు వ్యక్తులు గాయ పడ్డారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వెంకటయ్య, అశోక్ తన ద్విచక్ర వాహనంపై మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట నుంచి ధర్మపురి వైపు బయలు దేరారు. ఆ సమయంలో ఆవు దూసు కు రావడంతో ధర్మపురి నుంచి రాయపట్నం వైపు వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడి గాయపడ్డారు. ఆటో డ్రైవర్ కూడా గాయపడినట్లు తెలుస్తోంది.


బోల్తా పడిన ఆటో

ఎన్టీపీసీలో మరిన్ని సౌర వెలుగులు

- రామగుండంలో మరో 176 మెగావాట్ల సోలార్ విద్యుత్ విస్తరణ
- రూ.800 కోట్లతో కొత్త ప్రాజెక్టు
- ఇప్పటికే 100 ఫ్లోటింగ్, 10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్ విద్యుత్


దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు


10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్ ప్రాజెక్టు

జ్యోతినగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రామగుండంలోని ఎన్టీపీసీలో మరిన్ని సౌర వెలుగులు రానున్నాయి. 4200 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ(సాంప్రదాయేతర)పై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఇప్పటికే 10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్, 100 మెగావాట్ల ఫ్లోటింగ్(నీటిలో తేలియాడే) సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను ఎన్టీపీసీ నెలకొల్పింది. ఈక్రమంలో సౌర విద్యుత్ విస్తరణకు సిద్ధమైంది. దీనిలో భాగంగా ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, పక్కనే ఉన్న స్థలంలో మరో 120 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు నిర్మించనున్నది. ఇప్పటికే 176 మెగావాట్ల ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయి లాంఛనంగా నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఇప్పటికే 100 మెగావాట్ల దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సౌర ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎన్టీపీసీ మరో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌర విద్యుత్ యూనిట్‌తో మరో రికార్డు సృష్టించనున్నది.

● త్వరలో ప్రధాని మోదీతో శంకుస్థాపన

సుమారు 800 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 176 మెగావాట్ల సౌర(ఫ్లోటింగ్, సర్ఫేస్)విద్యుత్ ప్రాజెక్టుకు త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ ఎన్టీపీసీ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న ప్రధాని వర్చువల్‌గా ఇక్కడి సోలార్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎల్‌అండ్‌టీ సంస్థకు నిర్మాణ కాంట్రాక్టు లభించగా, ప్రాజెక్టుకు అవసరమైన సోలార్ ప్యానళ్లు ఇతర ఉపకరణాలు ఇక్కడికి చేరుకున్నాయి.

తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి వరద ఎక్కువగా వస్తుండడంతో గురువారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన గేట్లను అధికారులు తెరిచారు. ప్రాజెక్టుకు చెందిన మూడు గేట్లను తెరిచి 9,372 క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 18,826 క్యూసెక్కుల నీరు వస్తోంది.

బతికెపల్లిలో ఒకరి ఆత్మహత్య

పెగడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన పోచంపల్లి మల్లయ్య (56) అను వ్యక్తి అనారోగ్య సమస్యలతో కత్తితో గొంతులో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్య రెండేళ్లుగా లివర్, గుండె, కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఆరు నెలల క్రితం లివర్ చెడిపోయిందని వైద్యులు తెలిపారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఆత్మహత్య చేసున్నట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్.రవికిరణ్ తెలిపారు.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఆడ శిశువు మృతదేహం లభ్యం

హుజూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో గురువారం రాత్రి బాత్రూంలో ఆడ శిశువు మృతదేహం లభ్యమైంది. గుర్తు తెలియని మహిళ ఆడ శిశువును జన్మించిందనే ఉద్దేశంతో బాత్రూంలో పడేసి వెళ్లినట్లు తెలుస్తోంది. 24గంటలు వైద్యులు, జనం తిరుగుతూ ఉండే ఆస్పత్రిలో శిశువు లభ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. ఎమర్జెన్సీ రూమ్‌లోని బాత్రూంను ఆస్పత్రి సిబ్బంది శుభ్రం చేయడానికి వెళ్లగా మృతి చెందిన ఆడ శిశువు కనబడింది. దీంతో వైద్యులకు విషయాన్ని తెలపడంతో, పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా వేరే ఆస్పత్రిలో అబార్షన్ చేయించుకొని ఈ ఆస్పత్రిలో పడేసినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు. ఏది ఏమైనా పోలీసులు లోతుగా విచారణ చేపడితే అసలు విషయాలు బయటకి వచ్చే అవకాశం ఉంది.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం

-ఎస్సీ వర్గీకణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య

సుభాష్‌నగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని ఎస్సీ వర్గీకణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య, కో చైర్మన్ నల్లల కనకరాజు అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగానికి ఆర్టికల్ 341కు, పార్లమెంట్‌కు వ్యతిరేకంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2011 లెక్కలను వ్యతిరేకిస్తు న్నామన్నారు. 2014 నుంచి 2024 వరకు లెక్కలు తీస్తే ఎవరు అభివృద్ధి చెందారో, ఎవరు చెందలేదో తెలుస్తుందన్నారు. అభివృద్ధి చెందని వారికోసం ప్రభుత్వం ప్రత్యేకమైన ప్యాకేజీలు, బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదుగురు రిటైర్డ్ జడ్జిలతో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాలలను చైతన్యం చేస్తూ, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా నవంబరులో లక్షలాదిమందితో మాలల శక్తి ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా మాలల చైతన్య బస్సు యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తాళ్లపల్లి రవి, రాంచందర్, మేడి రాజవీరు, కొరివి వేణుగోపాల్, ఆర్ష మల్లేశం, కరణం కిషన్, గోపోజు రమేశ్, కేశవులు, ఎర్రమల్ల రాములు, దాసరి దశరథం, మేడి అంజయ్య, బత్తుల ప్రదీప్, గంటల బట్టి అనమల్ల, మేడి మహేశ్, సొనాది వెంకటేష్, భైరం కుమార్, బిట్ల ప్రవీణ్, తీట్ల ఈశ్వరి, గంటల రేణుక, శీలం పుష్పలత, ఆశ విజయ, మేకల రజనీ, బండ అనిత, మేదిని లక్ష్మి, జంగ లక్ష్మి, మేకల రజని, అపర్ణ, ఉరుమడ్ల లక్ష్మన్, ఎడ్ల లక్ష్మి, మాది శ్రీహరి, మల్లెపల్లి సుమలత ఉన్నారు.

ఇంట్లో శుభకార్యం ఉంది.. శనివారం గంగాధర అంగడికి పోవాలి.. గొర్లు, మేకలు అగ్గువకే దొరుకుతయి.. రైతులే తెస్తరు కదా.. కూరగాయలు మంచిగుంటయి.. మసాలా దినుసులూ తీసుకోవచ్చు.. ఏమన్నా మరిచిపోయిన చిన్న వస్తువులూ దొరుకుతయి.. ఇవీ గంగాధర మండలంలో వినిపించే మాటలు.. ఇక్కడ శనివారం జరిగే అంగడికి ఐదు దశాబ్దాల చరిత్ర ఉంది. చుట్టుపక్కల గ్రామాల వారికి ఏ వస్తువులు కావాలన్నా గంగాధర అంగడికే వస్తారు. అందుబాటు ధరల్లో అన్ని వస్తువులు లభించడంతో బడుగు జీవులు ఎక్కువగా వస్తుంటారు. దీంతో ఇది గరీబోళ్ల సూపర్‌మార్కెట్‌గా పేరు పొందింది..



గంగాధర వారసంతలో మసాల దినుసుల షాపు

గరీబోళ్ల సూపర్ మార్కెట్

- గంగాధర అంగడిది ఐదు దశాబ్దాల చరిత్ర
- తాజా కూరగాయలు..
- భారీగా పశువుల అమ్మకాలు

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర వారసంతది 50 ఏళ్ల చరిత్ర. మండల కేంద్రంలోని బ్లాక్ వద్ద ప్రతి శనివారం అంగడి జరుగుతుంది. ప్రస్తుతం విస్తరించిన సాంకేతికతతో ఇంటివద్దకే అన్ని వస్తువులు వస్తున్న కాలంలోనూ ఈ అంగడికి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ఇక్కడ తాజా కూరగాయలు, ఇంటికి అవసరమయ్యే వస్తువులు, మసాలా దినుసులు, పండ్లు, బట్టలు, చిరుధాన్యాలు, తినుబండారాలు, ప్లాస్టిక్ వస్తువులు ఇలా ఒక్కటేమిటి అన్నీ లభిస్తాయి. రైతులకు అవసరమైన వస్తువులు అందుబాటు ధరలో దొరుకుతాయి. ఈ సంత ద్వారా గ్రామ పంచాయతీకి భారీగా ఆదాయం సమకూరుతోంది

● మేకలు, గొర్రెల కోసం ఇతర జిల్లాల నుంచి రాక

ఉమ్మడి జిల్లాలో మేకలు, పశువులకు గంగాధర అంగడిది పెట్టింది పేరు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు అన్ని వర్గాల వారికి మేకలు, గొర్రెలు అందుబాటులో ఉంటాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, వరంగల్‌తోపాటు మహరాష్ట్ర నుంచి ఇక్కడికి మేకలు, గొర్రెలు, పశువుల అమ్మకాలు, కొనుగోళ్ల కోసం వస్తుంటారు. పాడి పశువుల విక్రయం జోరుగా సాగుతుంది. పెళ్లిళ్లు, పండగల సమయంలో ఒక్కో వ్యాపారి సుమారుగా వంద మేకలను అమ్ముతారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ఐదు వందల మంది పశువుల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

● రైతులే విక్రయదారులు

గతంలో ఊళ్లో ఇంటింటికి తిరిగి కూరగాయలు విక్రయించే వారు. ప్రస్తుతం గంగాధర వారసంతకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకుని రైతులే స్వయంగా తాజా కూరగాయలను విక్రయిస్తున్నారు. కూరగాయల వ్యాపారం రాత్రి ఏడు గంటల వరకు సాగుతుంది. ఉద్యోగులు, ప్రజలు, వ్యాపారులు ఎక్కువగా ఇక్కడి నుంచే వారానికి సరిపడా కూరగాయలు తీసుకెళుతుంటారు. అంగడిలో అల్లం, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, మసాలా దినుసులు తక్కువ ధరలో దొరుకుతాయి.

● గ్రామ పంచాయతీకి రూ. 1.6 కోట్ల ఆదాయం

గంగాధర వారసంత 50 ఏళ్ల క్రితం కూరగాయలు, బట్టలు, చిన్న చిన్న వస్తువుల అమ్మకాలతో ప్రారంభమైంది. మెల్లిమెల్లిగా విస్తరించి జిల్లాలోనే రెండో పెద్ద సంతగా నిలిచింది. నాడు గ్రామ పంచాయతీకి ఏటా 150 రూపాయల ఆదాయం వచ్చేంది. ప్రస్తుతం అది 1.6 కోట్ల రూపాయలకు చేరింది. ఆదాయానికి తగినట్లు అంగడిలో సౌకర్యాలు కల్పించారు. కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకునే వారికి రోడ్డు వెంట రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. పశువులకు ప్రత్యేకంగా అంగడి చుట్టు ప్రహరీ నిర్మించి వాహనాల నుంచి వాటిని దింపడానికి గద్దెలను ఏర్పాటు చేశారు.


సంతలో దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళ


విక్రయానికి వచ్చిన పశువులు


సంతలో కూరగాయల విక్రయం

సాహిత్య సృజనతో సమాజంలో శాంతి పరిమళిస్తుంది

అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ఎన్నీల ముచ్చట్లలో పాల్గొన్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాహిత్య సృజనతో సమాజంలో శాంతి పరిమళిస్తుందని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం రాత్రి తన క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 138 ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ప్రతీ పౌర్ణమి ఒక రచయిత ఇంట్లో కవులందరూ కలిసి సామూహికంగా కవిత గానం చేయడం సాహిత్య చరిత్రలో గొప్ప అధ్యాయమన్నారు. నేటి పౌర్ణమి నుంచి కవితలకు బదులుగా కథా పఠనం చేయాలని నిర్ణయించడం గొప్ప పరిణామమని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు సి వి కుమార్, ప్రదాన కార్యదర్శి డి. శంకరయ్య, సీనియర్ కథా రచయితలు బీవియన్ స్వామి, బుర్ర తిరుపతి, గాజోజు నాగభూషణం ఉన్నారు.

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సిద్ధం

ఏడు మిల్లులను నోటిఫై చేసిన అధికారులు



జమ్మికుంట జిన్నింగ్ మిల్లులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న అధికారులు.

జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసేందుకు ఏడు మిల్లులను అధికారులు నోటిఫై చేశారు. వైభవ్, వజ్రకల్ప, లక్ష్మి, నరసింహా, సరిత, రాజశ్రీ, సీతరామ కాటన్ మిల్లులను ఎంపిక చేశారు. మిల్లర్లతో ఇంకా అగ్రిమెంట్‌చేసుకోలేదు. గురువారం వీటిలో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ చేశారు. నోటిఫై చేసిన మిల్లుల్లో రైతులకు సీసీఐ నిభందనలపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ సీసీఐకి పత్తి విక్రయించే రైతులు ఆధార్‌కార్డు, పట్టదారు పుస్తకం, ఆధార్‌తో అనుసంధానం ఉన్న బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌ల వెంట తీసుకురావాలని సూచించారు. ఎనిమిది నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు 7,521 నుంచి 7,220 రూపాయలు చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఇంటి వద్దనే పత్తిని ఆరబెట్టుకుని, నీళ్లు చల్లకుండా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొద్ది రోజుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతాయని, అప్పటి వరకు రైతులు అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు.

తలనీలాల టెండర్ రూ.1.80 కోట్లు


టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలనీలాల పోగు చేసుకునేందుకు అధికారులు నిర్వహించిన వేలంలో రూ.1.80కోట్లు హెచ్చు పాటగా నిలిచింది. తరచూ వాయిదా పడుతూ వస్తున్న టెండర్లలో కాస్త పెంచారు. ఇప్పటికే తొమ్మిది సార్లు టెండర్లు నిర్వహించగా తగిన వేలం రాకపోవడంతో వేలం వాయిదా వేసిన అధికారులు పదో సారి గురువారం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్‌కం బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో అయిదుగురు టెండర్ దారులు పాల్గొన్నారు. మార్కెట్‌లో ధరలు లేవనే షాకుతో టెండర్ పెంచకుండా వస్తున్న టెండర్ దారులు నేటి వేలంలో ఏడాది కాలపరిమితికి గాను కేవీఎస్ ఎంటర్‌ప్రైజెస్ రూ.కోటి 80లక్షల వెయ్యి హెచ్చు పాట పలికింది. దీంతో ఖరారు చేయడానికి గాను అనుమతి కోసం కమిషనర్‌కు నివేదించినట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఏడాది కాలపరిమితికి గాను గతంలో రూ.3కోట్లకు పైగా పలుకగా ఇరవై రోజుల క్రితం నిర్వహించిన వేలంలో రూ.1.76 హెచ్చు పాట వచ్చింది. అయితే దాన్ని రద్దు చేశారు. సుమారు రూ.2లక్షలకు పైగా ఖర్చుతో రూ.4లక్షలు పెరిగినట్లు అయింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, డిప్యుటి కమిషనర్ టి.వెంకటేష్, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్ ఆలయ సిబ్బంది ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

● నిల్వ తలనీలాలకు కిలోకి రూ.10,300

గత ఏడాది ఆగస్టు నుంచి జూలై వరకు దేవస్థానం ఆధ్వర్యంలో సేకరించి నిల్వ చేసిన తలనీలాల విక్రయానికి గాను ఈ టెండర్‌లో కిలోకి రూ.10,300పలికింది. ఇందులో 11 మంది పాల్గొనగా హైదరాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హేర్ ఎంటర్ ప్రైజెస్ కిలోకి రూ.10,300తో హెచ్చు పాటగ నిలిచింది. రెండు నెలల క్రితం నిర్వహించినప్పుడు కిలోకి రూ.8500 రాగ ఇప్పుడు రూ.1800 అదనంగా ఆదాయం సమకూరనుంది.

ప్రేమ పేరుతో వేధింపులు

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

జగిత్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రేమ పేరుతో వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ బాలిక (13) ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు (13) కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి

భగత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. బాధిత మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను అమలు చేస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్నకు 'డిప్యూటేషన్ల' భారం

- సాధారణ బదిలీలకు ఉద్యోగుల దూరం
- సిబ్బంది కొరత నెపంతో కొనసాగింపు
- ఏళ్ల తరబడి విధులు.. పట్టించుకోని దేవాదాయ శాఖ

మల్యాల,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో డిప్యూటేషన్‌పై వచ్చిన ఉద్యోగ సిబ్బంది ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారు. దేవస్థానానికి భారం అయినప్పటికీ సిబ్బంది కొరత నెపంతో దేవాదాయ శాఖ మిన్నకుండిపోతోంది. ఇటీవల సాధారణ బదిలీలు జరుగగా అందులో అవకాశం లేకపోవడంతో డిప్యూటేషన్ ఉద్యోగులు తాము కోరుకున్న చోటకు వచ్చిన చోటే కదల కుండా ఉండాల్సి వచ్చింది. చిన్న ఆలయాల నుంచి డిప్యూటేషన్‌పై రావడం కాలపరిమితి ముగిసే సమయానికి అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతి నిధులతో పైరవీలు చేయించుకుంటూ ఏళ్ల తరబ డి కొండగట్టు అంజన్నను వీడడం లేదు. ఇలా 12 ఏళ్లుగా కొందరు ఇక్కడే కొనసాగుతున్నారంటే డిప్యుటేషన్ ఉద్యోగాలకు ఎంత ప్రాధాన్యత ఉందో తెలుస్తోంది.



● నిబంధనలు ఇవీ..

రాష్ట్ర వ్యాప్తంగా గల డిప్యూటీ కమిషనర్, రీజినల్ జోనల్ కమిషనర్ స్థాయి దేవస్థానాలలో పని చేసే ఉద్యోగుల విధివిధానాలను గత 2000 సంవత్సరంలో జీవో 888 ద్వారా ఖరారు చేశారు. దానికి 2019లో అన్ని రకాల బదిలీలు సమాన స్థాయి ఆలయాల్లోకి మాత్రమే చేపట్టాలని జీవో ఎంఎస్ 64 ద్వారా సవరణ చేశారు. నెల రోజుల క్రితం జరిగిన బదిలీలు అన్నింటిని దేవాదాయ శాఖ ఇలాగే చేపట్టింది. ఆర్‌జేసీ, డీసీ ఆలయాలను యానిట్‌గా తీసుకొని బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఇందులో డిప్యూటేషన్‌పై వచ్చిన వారికి అవకాశం లేకపోగా పెద్ద ఆలయాల్లో చిన్న దేవస్థానాల నుంచి వచ్చిన ఉద్యోగులకు మాత్రం స్థాన చలనం కాకపోగా వారి స్థానాలు పదిలంగా ఉన్నాయి. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు సమానస్థాయి ఆలయాలకు సంబంధించిన ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉండగా చిన్న ఆలయాల ఉద్యోగులు ఏళ్ల తరబడి తమ కాలపరిమితి పెంచుకునే ఆదేశాలు తీసుకువస్తూ విధులు నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆరుగురు ఉద్యోగులు ప్రస్తుతం డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో కొందరు తరచూ పొడగింపు ఆదేశాలతో ఏళ్లుగా కొనసా గుతున్నారు. ఇందులో కొందరి డిప్యూటేషన్ ఇటీవల ముగుస్తుండడంతో మళ్లీ పొడగింపు నకు దేవస్థానం అధికారులు కమిషనర్‌కు నివే దించినట్లు తెలిసింది. దేవస్థానానికి సమకూరే ఆదాయంలో 30శాతం దాటకుండా ఉద్యోగ జీతభత్యాలు చెల్లించాలనే నిబంధనలు, దేవస్థానం ఆదాయానికి నష్టం వాటిల్లుతున్నప్పటికీ పట్టించుకునే వారే లేరని పలువురు బహిరం గగానే ఆరోపిస్తున్నారు

కొరతతోనే కొనసాగింపు

ఎం. రామకృష్ణరావు, ఈవో

దేవస్థానం ఆదాయంలో 30శాతం కాస్త దాటినప్పటికీ ఉద్యోగుల కొరత దృష్ట్యా డిప్యుటేషన్ ఉద్యోగుల విధులు తప్పనిసరిగా వినియోగించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ డిప్యుటేషన్లు గతంలో నుంచే కొనసాగుతున్నాయి. కాలపరిమితి ముగిసిన ఉద్యోగుల డిప్యూటేషన్ పొడగింపునకు కమిషనర్‌కు నివేదించాము.

20న సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్, అక్టోబరు17: (ఆంధ్రజ్యోతి): సహకార భారతి 4వ రాష్ట్ర సమ్మేళనం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యామడుగు శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి తెలిపారు. గురవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో రాష్ట్ర సమ్మేళనం కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చింతకుంటలో నిర్వహించే రాష్ట్ర సమ్మేళనానికి సహకార భారతి జాతీయ సంఘటన మంత్రి సంజయ్ పాచ్పోర్, జాతీయ మంత్రి చాందినీరాయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి సుమారు వేయి మంది కార్యకర్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సర్వాజి తిరుపతి, ఉపాధ్యక్షుడు దొనపాటి సురేందర్‌రెడ్డి, కొత్తపల్లి కన్వీనర్ బండ కిషన్‌రెడ్డి, కో కన్వీనర్ చిటుకూరి శ్రీనివాస్, మన ఆదర్శ డైరెక్టర్ ఉమ్మెంతుల లక్ష్మారెడ్డి, చింతకుంట కన్వీనర్ దొనపాటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా పండుగ

● కరీంనగర్ రీజియన్‌కు రూ. 31.50 కోట్ల ఆదాయం

భగత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి కరీంనగర్ రీజియన్‌లో దసరా పండుగకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఆర్టీసీ వివిధ రూట్లలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించి రీజియన్ వ్యాప్తంగా 31.50 కోట్ల ఆదాయం రాబట్టింది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఈనెల మొదటి తేదీ నుంచే కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులను ప్రణాళికాబద్ధంగా నడిపిం చడంలో ఆర్టీసీ అధికారులు సఫలమయ్యారు. ఈ నెల 1వ తేదీ నుంచి 16 తేదీ వరకు ఆర్టీసీ బస్సులను విజయవంతంగా నడిపిం చింది. దసరా ముందు రోజుల్లో జూబ్లీ నుంచి కరీంనగర్, దసరా తర్వాత తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్ల మధ్య అదనంగా బస్సులను నడిపించి రికార్డు స్థాయిలో ప్రయాణికులను చేరవేసింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 53.32 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిపించి, 95 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్)తో మొత్తం 61,11,849 మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరవేసింది.

ఆదాయ సముపార్జనలో సిబ్బంది కృషి

- కరీంనగర్ ఆర్ఎం సుచరిత



ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు ఆదాయ సముపార్జనలో సిబ్బంది కృషి ఎంతో ఉంది. రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల్లో ఆదాయ సముపార్జనలో శక్తివంచన లేకుండా సంస్థ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు ఎంతో కృషి చేశారు. ఆర్టీసీ సేవలు మరింత ముందుకు తీసుకువెళ్తాం.

● కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా డిపోల వారీగా వచ్చిన ఆదాయ వివరాలు..

డిపో	కి.మీ (లక్షల్లో)	ఆదాయం (లక్షల్లో)	ఓఆర్	మొత్తం ప్రయాణికులు	మహాలక్ష్మి ప్రయాణికులు
గోదావరిఖని	8.06	527.45	104	9,79,400	6,87,807
హుస్నాబాద్	2.63	143.42	96	4,00,808	2,77,121
హుజూరాబాద్	3.46	211.49	107	4,89,314	3,25,629
జగిత్యాల	7.18	421.74	92	8,08,209	5,70,138
కరీంనగర్-1	6.31	338.36	81	5,51,087	3,53,221
కరీంనగర్-2	7.91	423.19	86	6,65,215	4,22,017
కోరుట్ల	3.59	225.73	99	4,56,980	3,46,469
మంథని	3.19	183.91	92	3,04,307	1,98,840
మెట్‌పలి	3.24	214.21	102	4,72,399	3,60,976
సిరిసిల్ల	3.78	227.44	99	4,68,034	2,96,512
వేములవాడ	3.98	232.86	97	5,16,096	3,95,814
రీజియన్	53.32	3149.80	95	6111849	4234544

గడువులోపు సీఎంఆర్ అప్పగించాలి

అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం, యాసంగి 2023-24 సీజన్‌లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను నిర్ణీత గడువు లోపు అప్పగించాలని అదనపు కలెక్టర్ రాంబాబు రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో సీఎంఆర్ డెలివరీపై రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023-24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్‌ను ఈనెలఖారులోపు ఎఫ్‌సీఐకి అప్పగించాలని సూచించారు. 2024-25 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యం దిగుమతి చేసుకోవడానికి మిల్లర్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఇందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా మేనేజర్, పలువురు బాయిల్డ్ రైస్ మిల్లర్లు, రా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మంగళంపల్లి మారుతి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంవత్సరాల తరబడి ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దాదాపుగా 7500 కోట్ల పైగా పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం నిధులు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఆయన కోరారు. నాయకులు బండి అరుణ్, సాదుల పుతిన్, పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ బోనగిరి నరేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో నిర్వహిస్తున్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పశువైద్యాధికారులు, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

పెద్దవాగు వెంట ఆగని ఇసుక దందా

● వరద కాలువ వెంబడి ఇసుక డంపుల నిల్వలు ● ఇసుక రీచ్‌ల ఏర్పాటులో అధికారుల జాప్యం



దుంపెట శివారులో వరద కాలువపై నిల్వ ఉంచిన ఇసుక డంపులు

కథలాపూర్, అక్టోబరు 17 : పెద్దవాగు ఇసుక అక్రమదారులకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. రేయింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్లతో యదేచ్ఛగా ఇసుకాసురులు దందా కొనసాగిస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు కూత వేటు దూరంలో ఉన్న తక్కళ్ళపల్లి, సిరికొండ వాగు నుంచి ప్రతీ రోజూ వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలిపోతోంది.

● ఎటూ చూసినా డంపులే..

మండలంలో పెద్దవాగు అంబారిపేట, తాండ్ర్యాల, దూలూరు, బొమ్మెన, తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల మధ్యలోంచి ప్రవహిస్తోంది. వానలు పుష్కలంగా కురవడంతో పైభాగం నుంచి ఇసుక వాగులో వచ్చి చేరింది. ఇదే అదనుగా అక్రమార్కులు మూడు టిప్పర్లు...ఆరు ట్రాక్టర్లు చందంగా ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో కొందరు కూలీలను ఏర్పాటు చేసుకుని ట్రాక్టర్లతో వరద కాలువ వెంట డంపులు నిల్వ చేసుకుంటున్నారు. మరికొందరు జేసీబీ సహాయంతో టిప్పర్లలో ఇసుకను నిజామాబాద్, మెట్‌పల్లి, కోరుట్ల వంటి పట్టణాలకు తరలిస్తున్నారు. అధికారులను మేనేజ్ చేస్తున్నామనే భావనతో అడ్డూ అదుపూ లేకుండా ఇసుక తరలిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ట్రాక్టర్లను పట్టు కుంటున్న సమయంలో రాజకీయ జోక్యం మితిమీరిపోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తక్కళ్లపల్లి, దూలూరు, సిరికొండ వాగులో బ్లేడ్ ట్రాక్టర్ల సహాయంతో ఇసుకను జాలి పట్టిస్తున్నారు. ఈ ఇసుకకు మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతుండడం వల్ల ఇసుక మాఫియా తేటగా మార్చుకుంటున్నారు. ట్రిప్పునకు రు. 4 వేల చొప్పున విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికార యంత్రాంగం నిఘా కొరవడడం వల్లే ఇసుక తోడేళ్ళు పెరిగిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

● రీచ్‌ల ఏర్పాటుకు సర్వే పూర్తి

వినోద్, తహసీల్దార్



ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వంకు వచ్చే ఆదాయం కోల్పోతుందనే ఉద్దేశ్యంతో రీచ్‌ల ఏర్పాటుకు కలెక్టర్ నిర్ణయించారు. ఈ మేరకు తక్కళ్లపల్లి, సిరికొండ గ్రామాల్లో భూగర్భ జల శాఖ, మైనింగ్ అధికారులు సర్వేలు చేపట్టారు. ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వానికి ఎంత మేర ఆదాయం సమకూరే అవకాశం ఉందనే అంశంపై అధ్యయనం చేశారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు రాగానే రీచ్‌లు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతానికి వాగులో తమ సిబ్బందితో నిఘా ఉంచాం.

పథకాలపై ప్రశ్నించినందుకే కేసు

జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్



మహేష్‌ను పరామర్శిస్తున్న దావ వసంతసురేష్

రాయికల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలపై ప్రశ్నించినందుకే సామాన్యులపై కేసులు పెడుతున్నారని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన కేసు నుంచి విడుదలైన మండలంలోని అల్లీపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు అనుమల్ల మహేష్‌ను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో మార్పు మొదలైందని, ప్రజలంతా కేసీఆర్ పాలనే కావాలని కోరుకుంటున్నారని అన్నారు. జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, వారందరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. మహేష్‌పై పెట్టిన అక్రమ కేసు గురించి కేటీఆర్‌కు సమాచారం అందించగా బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ ద్వారా విడుదలయ్యేంత వరకు అన్ని తానే చూసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్ రాజలింగం, గ్రామ శాఖ అధ్యక్షుడు రత్నాకర్ రావు, రాయికల్ ఏఎంసీ మాజీ చైర్మన్ బర్కం మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ సాగర్‌రావు, నాయకుల పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన పుల్ల రాజు అనారోగ్యంతో, జుంగుల గంగాధర్ తాడి చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందగా మృతుల కుటుంబాలకు అమెరికా గ్రేటర్ అట్లాంట తెలంగాణ సొసైటీ సభ్యుడైన బత్తిని నవీన్ కుమార్ చేయూతను అందజేశారు. గురువారం గ్రామంలోని రాజు కటుంబానికి రూ. లక్ష, గంగాధర్ కుటుంబానికి రూ. యాభై వేలు మృతుల ఇరు కుటుంబంలోని ముగ్గురి పిల్లలైన ఒక్కక్కరి పైన డిపాజిట్ చేసిన పత్రాలను నాయకులు అందజేశారు. నాయకులు గూడూరి తిరుపతి, బత్తిని శంకర్‌గౌడ్, కోలు పెద్ద గంగారం, మంతెన గణేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న నాయకులు

పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల మినీ మీటింగ్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ రోజు ఎన్ని దరఖాస్తులను పరిష్కరిస్తున్నారన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. శిఖం భూముల్లో, వక్ఫ్ భూములు, కమర్షియల్, పబ్లిక్ ల్యాండ్ జోన్ దరఖాస్తులను సైతం పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, మున్సిపల్, రెవెన్యూ, ఎంపీడీవో, ఎంపీవో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని 106 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మెరుగు మురళి గౌడ్, బొప్పు తిరుపతి, గుండాటి సందీప్ రెడ్డి, పూదరి రవి, గోపతి నరేష్, వేల్పుల రవి పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

జగిత్యాల ఎస్ఈ శాలియా నాయక్

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రతి విద్యుత్ ఉద్యోగి నిత్యం విస్తృత ప్రచారం కల్పించాలని తద్వార మనుషులు, మూగ జీవాల ప్రాణాలను రక్షించాలని జిల్లా ఎస్ఈ శాలియా నాయక్ అన్నారు. గురువారం మెట్‌పల్లి విద్యుత్ అధికారులతో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను జీరో యాక్సిడెంట్ జిల్లాగా నిలబెట్టడానికి క్షేత్రస్థాయిలో విద్యుత్ నెట్వర్క్‌ను పటిష్టం చేయాలన్నారు. ముఖ్యంగా ఇంజనీర్లు స్థానికంగా ఉన్న కాలేజీలు, పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను ప్రత్యక్షంగా గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదాల గురించి మళ్లి అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండటానికి ఇళ్లలో, గ్రామాలలో తమ తల్లి దండ్రులకు అవగహన కల్పించే విధంగా వారికి వివరించాలన్నారు. రైతులు వ్యవసాయ పంపుసెట్లకు ఫైబర్ బాక్స్‌లు అమర్చుకోనే విధంగా అవగహన కల్పించాలన్నారు. రైతులు తమ పంట పొలాల వద్ద అడవి పందుల బెడద కోసం అక్రమంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. విద్యుత్ షాక్‌లకు గురికాకుండ సరైన అవగహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ తిరుపతి, ఏడీఈలు మనోహార్, శ్రీనివాస్‌రావు, అంజన్ రావు, రఘు పతి, ఏఈలు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

రాయికల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం వాల్మీకీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు వాల్మీకీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకీ జీవితానికి, రామాయణ రచనలో ఆయన కృషికి సంబంధించిన విషయాలను ప్రస్తావించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లి : గొల్లపల్లి మండలం భీంరాజ్ పల్లె గ్రామంలో రామాయణం వ్యాసకర్త వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బొమ్మెన కుమార్, రేవెల్ల లిం గయ్య, బొమ్మెన వెంకటేశం, కంది స్వామి, కంది వెంకటేశం, మాజీ సర్పంచ్ సత్యానారాయణ గౌడ్, సింగారపు దొంగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్ : వాల్మీకీ మహాముని జన్మదిన వేడుకలను జగిత్యాల పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వాల్మీకీ స్ఫూర్తితో అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని అన్నారు. వాల్మీకీ మహాముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన స్ఫూర్తిని స్మరించుకున్నారు. గౌరిశెట్టి విశ్వనాథం, ప్రకాష్ రావు, విజయ్, పీసీ హన్మంత్ రెడ్డి, ఎండీ యాకూబ్, నారాయణ, సత్యనారాయణ, దేవేందర్ రావు, మురళీధర్ పాల్గొన్నారు.



వాల్మీకీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, సిబ్బంది

పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ

మల్లాపూర్, అక్టోబరు, 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు ఎంపీడీవో జగదీష్ మెమోలు జారీ చేయడం గురువారం చర్చనీయాంశంగా మారింది. మల్లాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చెందిన అధికారుల గ్రూప్‌లో ఎంపీడీవో, ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారుల సంబంధించిన వాట్సాప్ గ్రూప్ ఉంది. దీనిలో నుంచి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా 23 గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు లెఫ్ట్ కావడంతో గమనించిన ఎంపీడీవో మెమోలు ఇచ్చినట్లు సమాచారం. పది రోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక తనిఖీలో ఈజీఎస్ సిబ్బంది కన్నా పంచాయతీ కార్యదర్శులకే అధికంగా జరిమానాలు పంపడడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా ఈజీఎస్ పనితీరుపై పంచాయతీ కార్యదర్శులపై అధికారుల దృష్టి సారించాలని, మెమో జారీ వెనుకాల ఏం జరుగుతుందో ఉన్నతాధికారుల గమనించాల్సి ఉంది.

●23 గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాట్సాప్ సమూహం నుంచి లెఫ్ట్ కావడంపై ఎంపీడీవో మెమో జారి చేయగా వాటిని తీసుకున్న కార్యదర్శులు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సంజాయిషీ ఇచ్చేందుకు అధికారిని కలిశారు. ఏమైన ఇబ్బందులుంటే తెలుపాలని, గాని గ్రూప్ నుంచి లెఫ్ట్ కావడం సమంజసం కాదని ఎంపీడీవో జగదీష్ సూచించారు.

మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ స్థల పరిశీలన

బీర్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్ద గుట్టపై గతంలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ స్థలాన్ని గురువారం కేంద్ర అటవీ శాఖ అధికారి (ఐఆర్‌వో) కైలాస్ భీమ్‌రావ్ బిస్వాక్ పరిశీలించారు. మిషన్ భగీరథ పథకం కింద వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గతంలో అర ఎకరం(20గుంటల) స్థలం కేటాయించారు. ఈ స్థలంలో ఎన్ని చెట్లు తొలగించ బడ్డాయని, కేటాయించిన అర ఎకరం స్థలం కంటే మరి ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలను చేపట్టారా అని పరిసర ప్రాంతాన్ని తిరిగి పరిశీలించారు. ట్యాంక్ నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఎఫ్‌వో రవిప్రసాద్, ధర్మపురి రేంజ్ అధికారి శ్రీనాథ్, ఎఫ్ఎస్‌వోలు గంగారాం, ప్రకాష్, బీట్‌ఆఫీసర్లు శ్రీనివాస్ ఉన్నారు.

సీఎం, ఎమ్మెల్సీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

రాయికల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో ఇటిక్యాల, చెర్లకొండాపూర్‌లో అభివృద్ధి పనులకు ప్రత్యేక చొరవ చూపిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు, ప్రజలు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఇటిక్యాల గ్రామంలో ఆదర్శ మోడల్ స్కూల్ పిల్లల అవస్థలను గమనించి ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారని, ప్రభుత్వం రూ.64 లక్షలు మంజూరు చేయించారని పేర్కొన్నారు. అలాగే చెర్ల కొండాపూర్ గ్రామం నుంచి మైతాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో రూ. కోటి 86 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ శాఖ అధ్యక్షుడు పల్లికొండ రమేష్, ఆకుల రాజేందర్, గంగారెడ్డి, లక్ష్మీనారాయణ, రాజేందర్ పాల్గొన్నారు.

అనంతారం బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభం

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం బ్రిడ్జి వంతెన పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో జగిత్యాల-ధర్మపురి ప్రధానరహదారిలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. జగిత్యాల నుంచి ధర్మపురి వెళ్లే ప్రయాణికులు బ్రిడ్జి పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలను సాగించాలని అధికారులు సూచించారు.

మెట్‌పల్లి తహసీల్దార్‌కు ఆత్మీయ సన్మానం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని కొండ స్వామి ఆలయంలో మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌ను నాయకులు ఆత్మీయ సన్మానం చేశారు. గురువారం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం చేశారు. తహసీల్దార్, ఆర్ఐ ఉమేష్‌లు ఆలయంలోని స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్ల జగన్‌గౌడ్, వెంకటేష్, నర్సింహులు, పల్లికొండ గంగ నర్సయ్య, లక్మ శ్రీనివాస్, పాపు రాజేంధర్, కొరిపల్లి రాజం, టప్ప శ్రీనివాస్, నేరెళ్ల భూమయ్య, భక్తులు పాల్గొన్నారు.

జగ్గసాగర్‌లోనే కొనుగోలు కేంద్రం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో మ్యాక్స్ ద్వారా వరి కొనుగోలు కేంద్రాన్ని యధావిధిగా ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం అధికారులు తెలిపినట్లు కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తుండగా గత ప్రభుత్వ హయాంలో తొలగించారన్నారు. దీంతో రైతులు ధాన్యం విక్రహించడానికి తీవ్ర ఇబ్బందుల పడేవారన్నారు. సమస్యను కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైందన్నారు. దీంతో అధికారుల గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తామని తెలపడంతో నాయకులు, రైతులు జువ్వాడి నర్సింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

4 సెల్‌ఫోన్లు.. 2 ద్విచక్ర వాహనాలు, కత్తి స్వాధీనం

కోరుట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మూడు రోజుల క్రితం జరిగిన బోయిని సాగర్ అలియాస్ కళ్యాణ్, మంచోడు హత్య కేసులో నిందితులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. కోరుట్ల పట్టణంలోని సీఐ కార్యాలయంలో అరెస్టు వివరాలతో కూడిన ప్రెస్ నోట్‌లో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు వివరాలను వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన పంబాల మధు, ఇప్పకాయల నరేష్‌లతో బోయిని సాగర్‌కు మధ్య గొడవ జరిగింది. ఈ విషయమై గుడ్దెటి వెంకటేష్ వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నాలు చేసినా సాగర్ వినలేదు. ఈ క్రమంలో 14వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో సాగర్ తన అనుచరులతో కాలనీలోని పంబాల నాగరాజు ఇంటికి వెళ్లి అతనితో గొడవ పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న గుడ్దెటి వెంకటేష్, గుడ్దెటి విజయ్, రాకేష్ వెంటనే నాగరాజు ఇంటికి చేరుకున్నారు. అప్పటికే నాగరాజుతో గొడవపడుతున్న సాగర్‌ను వెంకటేష్ తనతో తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం నిందితులు పారిపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ శ్రీకాంత్ వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. నాగరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు. హత్య కేసులో గుడ్దెటి వెంకటేష్‌కు సహకారం అందించిన గుడ్దెటి విజయ్, ఇప్పకాయల రాకేష్, పంబాల మధు, ఇప్పకాయల నరేష్‌లను వారి వద్ద ఉన్న కత్తి, 4 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోని వారిపై కేసు నమోదు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు ప్రకటన ద్వారా తెలిపారు. మరో నిందితులు పంబాల నాగరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ

కోరుట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : హర్యానా రాష్ట్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన 9వ నేషనల్ లెవల్ బేస్‌బాల్ చాంపియన్ షిప్‌లో రాష్ట్రం తరుపున ప్రాతినిత్యం వహించిన పట్టణంలోని కేటీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి 3వ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ గుజ్జెటి వెంకటేష్ గురువారం తెలిపారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించి రాష్ట్రంకు పేరు తెచ్చారని ప్రిన్సిపల్ వెంకటేష్ తెలిపారు. పతకంతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


● డీఎంహెచ్‌వో సమియొద్దిన్

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జ్వరాల పట్ల వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సమియుద్దీన్ సూచించారు. మల్యాల ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీ ఎంహెచ్‌వో వెంట మండల వైద్యాధికారి మౌనిక ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

కోరుట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూటీఎస్ కోరుట్ల అధ్యక్షుడు అబ్దుల్ వాజిద్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడారు. 31 అక్టోబర్ 2024 వరకు ఏదైన హైస్కూల్‌లో పని చేసిన ఉపాధ్యాయులందరు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. ఓటర్ నమోదుపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ఫాం నంబర్ 19ని అందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయుటీఎస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు వెంకట సుధీర్, సర్తాజ్ అహ్మద్, సురేఖ, శ్రీనివాస్, సైపోద్దిన్, యూసుఫ్ అలీ, శ్యాంసుదర్, కృష్ణమోహన్‌రావు, గంగామహన్, ఆంజనేయులు, శ్వేత, తిరుపతి, జ్యోతి లక్ష్మిలు పాల్గొన్నారు.

వెల్గటూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం ఓటరు నమోదు చేసు కోవాలని కోరుతూ పీఆర్టీయు టీఎస్ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు గురువారం మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కోరుతూ సంబంధిత పత్రాలు అందజేశారు. ఫాం 19, అనెక్సర్-2 అందజేసి ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు టీఎస్ ఉపాధ్యాయ సంఘ మండల అధ్యక్షుడు నర్సింగం, ప్రధాన కార్యదర్శి శ్రీదర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, విమలాదేవి, రాజేశ్వర్, జయశ్రీ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు అల్లకట్టు సత్యనారయణను గురువారం ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అల్లకట్టు సత్యనారాయణ పలు మార్లు వివిధ జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందగా గురువారం గురుపౌర్ణమిని పురష్కరించుకోని అయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తనుగుల రమేష్, లింగంపల్లి సత్యనా రయణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు స్వాగతం

మల్లాపూర్, అక్టోబరు, 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు గురువారం విధుల్లో చేరడానికి వచ్చిన నూతన ఉపద్యాయులకు విద్యార్థులు, తల్లిదండ్రులు బ్యాండ్ మోళాలతో స్వాగతం పలికారు. గ్రామంలోని పాఠశాలలోని విద్యార్థులకు విద్యబోధన చేయడానికి ఉపాధ్యాయులు ప్రవళిక, జ్ఞానేశ్వరి, హరీష్‌లు వస్తున్నారని ఆనందంతో విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామంలోని బస్టాండ్‌లో పూలమాలలతో సన్మానించారు. నృత్యాలు చేసుకుంటూ స్వాగతం పలికారు.

రైల్వే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అందుతు న్న సేవలపై గురువారం చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సేవలను సద్వినియోగం చేసుకోవడంతో రైల్వేస్టేషన్ సేవలు తరలిపోకుండా చూడవచ్చుని ఆటో డ్రైవర్లు తమ వాహనాల్లో వచ్చే ప్రయాణికులకు వివరించాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న హైదరాబాద్ కాచిగూడ-కరీంనగర్ రైలును వినియోగించుకొని తక్కువ టికెట్ ధరలతో క్షేమకర ప్రయాణం చేసేలా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

కొడిమ్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్లాస్టిక్ వి నియోగాన్ని తగ్గించుకోవాలని ఎంపీడీవో స్వరూప కోరారు. గురువారం కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో ప్లాస్టిక్ ఏరివేతపై మండలంలోని గ్రామ పంచాయ తీలలో పారిశుధ్య సిబ్బందితో ప్లాస్టిక్‌ను ఏరివేయిం చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీవో సలీం, వివిధ గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.